
సాక్షి జనగామ

శుక్రవారం | 12 | ఏప్రిల్ | 2024



వేడి తగ్గాలి.. కోడి పెరగాలి!
ఎండ తీవ్రత అన్ని జీవరాశుల మీద పడుతోంది. ముఖ్యంగా ఎండాకాలం కోళ్ల పరిశ్రమ కుదేల వ్వాల్సిందే.. కోళ్లు బాగా పెరిగేలా శాస్త్రవేత్తలు పలు సూచనలిస్తున్నారు. - 8లో ▸



కడియం కావ్య స్థానికేతరురాలు
గుంటూరుకు చెందిన నజీరుద్దీన్‌ను వివాహమాడిన కడియం కావ్య స్థానికురాలు కాదని, తాను వరంగల్ బిడ్డనని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
$37^0 / 24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మామూలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



జనగామ : కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా దంపతులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ.. సమష్టి కృషితో జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నందుకు అధికారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అదరూ కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

సోమేశ్వరుడికి వెండి నక్షత్ర హారతి



పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన రాపాక సోమన్న, పారిజాతం వారి కుమారులు సందీప్, పృథ్వీరాజ్.. శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి వారికి వెండి నక్షత్ర హారతిని సమర్పించారు. రూ.53వేల విలువైన 665 గ్రాముల ఈ నక్షత్ర హారతిని గురువారం అందజేసినట్లు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు.

నేడు కాంగ్రెస్ సన్నాహక సమావేశం



జనగామ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన పట్టణంలోని ప్రెస్టన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం(నేడు) జరిగే సన్నాహక సమావేశ స్థలాన్ని గురువారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జనగామ ముఖ్య కార్యకర్తల సమావేశం ఉదయం 10 గంటలకు ఉంటుంది. ఎంపీ అభ్యర్థి చామళ్ల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్నికల సమన్వయకర్త కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరుకానున్న ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ కోరారు.

సమ్మయ్యకు పురస్కారం



దేవరుప్పుల : అప్పిరెడ్డిపల్లెకు చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యకు శ్రీ క్రోధి నామ ఉగాది పురస్కారాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేశారు. కిన్నెర ఆర్ట్స్ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతీలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేశారు.

ఈద్-ఉల్-ఫితర్

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ: జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలవంక దర్శనంతో మొదలైన నెలరోజుల కఠోర ఉపవాస దీక్షలు ముగిశాయి. ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులతో ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మతసామరస్యాన్ని చాటుతూ హిందువులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశాక మతగురువు నమాజ్ చదివించి దువా చేయించారు. అనంతరం పెద్దల సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగా పేద కుటుంబాలకు తోచిన విధంగా సహాయం చేశారు. ఈద్గా వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వంగాల కల్యాణిమల్లారెడ్డి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గాదెపాక రాంచందర్, మాజీ ఫ్లోర్‌లీడర్ ఎండీ.అన్వర్ పాల్గొన్నారు. పట్టణంలో ఏసీపీ అంకిత్‌కుమార్ పర్యవేక్షణలో సీఐ రఘుపతిరెడ్డి ఆధ్వర్యాన ఎస్సైలు సృజన్, తిరుపతి, భరత్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.





జనగామలోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

స్పందించిన సర్కారు

ధాన్యం ధర తగ్గింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

- మార్కెట్ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు.. విచారణ షురూ
- ముగ్గురు ట్రేడర్లపై కేసు నమోదు
- క్వింటా ధాన్యానికి రూ.30 పెంచిన వ్యాపారులు
- కాటన్ యార్డులో పీఏసీఎస్ సెంటర్ ప్రారంభం



జనగామ మార్కెట్‌లో ధాన్యాన్ని తూకం వేయడానికి బస్తాల్లో నింపుతున్న కూలీలు

జనగామ: జనగామ మార్కెట్‌లో అడ్డగోలు ధరతో ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. కనీస మద్దతు ధర కంటే క్వింటాకు రూ.600 నుంచి రూ.700 తక్కువ నిర్ణయించడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేయగా.. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జనగామ మార్కెట్‌లో జరిగిన ఘటనపై స్వయంగా సీఎం స్పందించడంతో రెవెన్యూ, మార్కెటింగ్, సివిల్ సప్లయ్, పౌరసరఫరాలు తదితర శాఖల అధికారులు రంగంలోకి దిగారు. మార్కెట్ యార్డు అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై ధర తక్కువ చేసి రైతులకు నష్టం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు ధాన్యం ధరలు తగ్గించిన సమయంలో రైతుల పక్షాన నిలిచి కార్యదర్శి, ట్రేడర్లపై అక్కడిక్కడే తగిన చర్యలు తీసుకున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను సీఎం మెచ్చుకున్నారు.

కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్‌కు డీఎంఓ నరేంద్ర షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ధాన్యం అమ్మకంలో తక్కువ ధరకు బిడ్డింగ్ వేసే సమయంలో నిర్లక్ష్యంపై సమాధానం చెప్పాలని అందులో అడిగారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేయిస్తున్నట్లు నరేంద్ర తెలిపారు. ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులకు కార్యదర్శి నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. సీఎం కూడా స్పందించడంతో కార్యదర్శిపై వేటు తప్పదంటున్నారు.

ముగ్గురు ట్రేడర్లపై కేసులు

మార్కెట్‌లో రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన వీఎస్ ట్రేడర్స్, ఉమా ట్రేడర్స్, పరమేశ్వర ట్రేడర్స్‌పై డీఎంఓ నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

క్వింటాకు రూ.30 పెంపు

కనీస మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేసిన ధాన్యానికి వ్యాపారులు రూ.30 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌లో ఆందోళన జరిగిన రోజే ధాన్యం కుప్పల్లో తేమ శాతం పరిశీలించి రికార్డు చేశారు. సుమారు 25వేల బస్తాలకు పైగా ధాన్యం ఉండగా.. ఇందులో అమ్మకం పూర్తయిన ధాన్యాన్ని లిఫ్టింగ్ చేస్తున్నారు.

నేడు అవగాహన సదస్సులు

ప్రభుత్వం ధాన్యానికి అందిస్తున్న మద్దతు ధర పొందేలా జిల్లాలోని 62 రైతు వేదికల్లో శుక్రవారం (నేడు) అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. తేమ 17 శాతానికి మించకుండా, తాలు లేని ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాల రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రైతలు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి తీసుకురావాలని సూచించారు.

కేసులు తేలే వరకు ధాన్యం కొనేది లేదు..

- మార్కెట్ అధికారులకు ట్రేడర్ల నోటీసు
- రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రావాలి : డీఎంఓ

వ్యవసాయ మార్కెట్‌లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తమపై పెట్టిన కేసుల విషయం తేలే వరకు కొనుగోళ్లు చేపట్టేది లేదని ది తెలంగాణ ఎక్స్‌పోర్టర్స్ అండ్ ఫుడ్ గ్రేయిన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగబండి రవీందర్ అన్నారు. ఈ మేరకు అసోసియేషన్ చేసిన తీర్మానం కాపీని గురువారం రాత్రి ప్రతినిధులతో కలిసి మార్కెట్ అధికారులకు అందజేశారు. యార్డులో హమాలీ సమస్యలతో పాటు పచ్చి ధాన్యం వస్తున్న నేపథ్యంలో తేమ శాతం ఆధారంగానే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తమపై పెట్టిన కేసుల సమస్యకు పరిష్కారం దొరికే వరకు మార్కెట్ బంద్ చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ–నామ్ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నామని, ఇందులో తమ తప్పు ఏమాత్రం లేదన్నారు.

కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలి : డీఎంఓ

మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేయబోమని ట్రేడర్లు నోటీసు ఇచ్చిన నేపథ్యంలో సమస్య పరిష్కారం అయ్యే వరకు రైతులు మార్కెట్ లోని పీఏసీఎస్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంతోపాటు జిల్లాలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన సెంటర్లలో ధాన్యం విక్రయించాలని సూచించారు. తేమ 17 శాతానికి మించకుండా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని చెప్పారు. కాగా ట్రేడర్లను శుక్రవారం(నేడు) మార్కెట్‌కు పిలిపించి మాట్లాడుతామని, వారు ఇచ్చిన నోటీసును కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వివరించారు.

మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రోజారాణి

మార్కెట్ కాటన్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లాలో 195 కేంద్రాలు ప్రారంభించామని, తేమ 17 శాతానికి మించకుండా, తాలు లేని ధాన్యం తీసుకువచ్చి ఎ–గ్రేడ్ రూ.2,203, సాధారణ రకం రూ.2,183 ధర పొందాలని అధికారులు రైతులకు సూచించారు. అత్యవసర సమయం, సెలవు రోజుల్లోనూ కొనుగోలు కేంద్రాలు ఉంటాయన్నారు. జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, సహకార అధికారి రాజేందర్‌రెడ్డి, ఏడీఏ వినోద్‌కుమార్, సివిల్ సప్లయ్ అధికారి రోజారాణి, జిల్లా మేనేజర్ ప్రసాద్, మార్కెటింగ్ అధికారి నరేంద్ర, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల బాధలు పట్టవా..?

- ధాన్యం ధర తగ్గించడం క్షమార్హం కాదు
- మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే 'పల్లా'



మార్కెట్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జనగామ: మార్కెట్‌లో రైతులు పడుతున్న బాధలు ప్రభుత్వానికి పట్టవా అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డగోలుగా ధర తగ్గించి ధాన్యం కొనుగోలు చేయడంపై స్పందించిన ఆయన గురువారం మార్కెట్‌కు చేరుకుని రైతులతో మాట్లాడారు. డీఎంఓ నరేంద్రతో కలిసి ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ 22 నుంచి 30 శాతం వరకు కనిపించగా.. ధర బిడ్డింగ్ వేసే క్రమంలో తేడా ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కొనుగోళ్లు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో మద్దతు ధరతోపాటు ప్రైవేట్ మార్కెట్‌లోనూ ధాన్యానికి రూ.1,850 నుంచి రూ.1,900 వరకు ధర పలికిందని చెప్పారు. ప్రస్తుతం తేమ ఉందనే సాకుతో క్వింటాకు రూ.600 నుంచి రూ.700 ధర తగ్గించడం క్షమార్హం కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా అధికారులు కేవలం రూ.30 పెంచడం సిగ్గుచేటన్నారు. మార్కెట్లో ప్రస్తుతం ఉన్న ధాన్యానికి రూ.2,200 ధర చెల్లించాలని, సోమవారం నుంచి వచ్చే ధాన్యానికి సైతం ఇదే ధర వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకునే వీలు లేక మార్కెట్‌కు వస్తే నిలువు దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు. ఇక నుంచి రోజూ మార్కెట్‌కు వచ్చి కొనుగోళ్లను పరిశీలిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, నాయకులు బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ముస్త్యాల దయాకర్, తిప్పారపు విజయ్, ఉల్లెంగు సందీప్, దేవునూరి సతీష్ ఉన్నారు.

రైతులను దోచుకుంటే చర్యలు తప్పవు

- మార్కెట్‌లో అవకతవకలపై విచారణ చేయిస్తాం ..
- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న కొమ్మూరి

జనగామ: రైతుల కష్టాన్ని దోచుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ధాన్యం ధర తగ్గడంతో గురువారం ఆయన జనగామ మార్కెట్‌ను సందర్శించారు. డీఎంఓ నరేంద్రతో కలిసి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర కల్పించాలనే ధ్యేయంతో ప్రభుత్వ ఉంటే.. ఇక్కడి మార్కెట్‌లో అందుకు విరుద్ధంగా జరుగుతోందన్నారు. తేమ 17 నుంచి 22 శాతం వరకు ఉంటే.. పెద్ద తేడా ఉండదని, ఇంత మాత్రాన క్వింటాకు ధర వందల్లో తేడా ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తక్కువ రేటుకు ధాన్యం అమ్ముకోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధరల కల్పన విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్‌లో మమ్ముళ్ల భాగోతం, పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలు, ట్రేడర్లు, అధికారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని విచారణ చేయిస్తామని చెప్పారు. రైతులకు ఏ సమస్య వచ్చినా జిల్లా కేంద్రంలోని తన కార్యాలయానికి రావొచ్చని సూచించారు. ఇదిలా ఉండగా.. మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో మాట్లాడినట్లు తెలిపారు. కొమ్మూరి వెంట పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జ్ భవానిరెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్, కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ లక్ష్మారెడ్డి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ అరవింద్, మార్కెట్ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, చిర్ర హన్మంతరెడ్డి, గొలుసుల దుర్గేష్ ఉన్నారు.

పంచాంగ పుస్తకాల వితరణ



పంచాంగ పుస్తకాలు అందజేస్తున్న నిర్వాహకులు

జనగామ : పట్టణంలోని కైలాసపురంలో ఉగాది వేడుకల్లో భాగంగా ఆర్యవైశ్య ప్రముఖులకు పంచాంగ పుస్తకాలను గురువారం వితరణ చేశారు. అలాగే వంగపల్లి ఆంజనేయస్వామిని సన్మానించారు. జిల్లా వితలగుప్తా, అరుణ, విజయ, హరిత, ఉమారాణి, రాజయ్య, సరిత, సంతోష్‌కుమార్, ఆంజనేయులు, రాజేశ్వరి, శ్రీజ పాల్గొన్నారు.

వెలుగు రేఖ జ్యోతిరావు పూలే..



బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో నివాళులర్పిస్తూ..

జనగామ: సమాజంలో కులాల బానిసత్వం, వివక్షకు వ్యతిరేకంగా మొదటిసారి ఉద్యమించిన వెలుగు రేఖ మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు అన్నారు. పూలే జయంతిని గురువారం కలెక్టరేట్‌లో అధికారికంగా, అలాగే ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, బీహెచ్‌పీఎస్, కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి, టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ అధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, జిల్లా అధికారులు రోజారాణి, ప్రసాద్, రాజేందర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో నాయకులు నిర్మల భాస్కర్, బొట్ల మహేష్, గంధమల్ల ఉదయ్ కిరణ్, సోమరాజు, కృష్ణ రవి, రాము, డాక్టర్ జేరిపోతుల పరశురామ్, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, శ్రీహరి, కనకయ్య, జంపయ్య పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది కుటుంబాలను ఆదుకోవాలి

- టీజీపీయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

దేవరుప్పుల : చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో అకాల మరణం పొందుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న డిమాండ్ చేశారు. కడవెండిలో అనారోగ్యంతో మృతి చెందిన జీపీ కార్మికుడు భాషిపాక అంజయ్య కుటుంబానికి గురువారం యూనియన్ తరఫున రూ.48,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహచర కార్మికులు చనిపోతే ఆ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను చూసి విరాళాల రూపేణ సాయం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సేవలు అందించే జీపీ కార్మికుల కనీస హక్కులను పాలకవర్గాలు సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రు, నాయకులు గొడిశాల సోమయ్య, ఉత్తెపు ఐలయ్య, యాదగిరి, వెంకన్న, పి.రామచంద్రు, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

బెల్ట్‌పై ఉక్కుపాదం

వరంగల్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీ చర్యలు

- పట్టుబడిన మద్యం 3,267 లీటర్లు.. విలువ రూ.17.61 లక్షలు
- 254 కేసుల్లో.. 616 మంది బైండోవర్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు మద్యం అమ్మకాలపై దృష్టి సారించారు. అడుగడుగునా తనిఖీలు చేస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి కొరఢా ఝులిపిస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారులను బైండోవర్ చేస్తున్నారు. ప్రతి రోజూ ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 16 నుంచి పోలీసులు దాడులు పెంచారు. ఎన్నికల సెక్షన్ నుంచి రోజూ ఎంత మద్యం పట్టుకున్నారు..? ఎంత విలువ..? తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. తక్కువ కేసులు నమోదు చేసే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్లు చేసి దాడులు పెంచాలని ఆదేశాలు జారీ అవుతున్నాయి. దీనికి తోడు టాస్క్‌ఫోర్స్ అధికారులు బెల్ట్ షాపులపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నారు. దీంతో భారీ మొత్తంలో మద్యం బాటిళ్లు, నల్లబెల్లం, పటిక, గంజాయి పట్టుబడుతున్నాయి. గీత దాటుతున్న వైన్, బార్ షాపుల యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తున్నారు.



వేలేరు బెల్ట్ షాపులో పట్టుబడిన మద్యం(ఫైల్)

మద్యం 3,267 లీటర్లు.. రూ.17.61 లక్షలు

మార్చి 16 నుంచి ఇప్పటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రూ.17.61 లక్షల విలువ గల 3,267 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని 200 కేసులు నమోదు చేశారు. 136 లీటర్ల గుడుంబా, 18 కేజీల నల్లబెల్లం, రెండు కిలోల పటిక పట్టుబడగా 13 కేసులు నమోదు చేశారు. వీటి విలువ రూ. 51,140. నిబంధనలను అతిక్రమించి అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారిపై 254 కేసుల్లో 616 మందిని బైండోవర్ చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నాం



నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నాం. ఇప్పటి కే అన్ని సెక్టార్ల సబ్ ఇన్‌స్పెక్టర్లు, బ్లూ కోల్ట్స్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. వైన్, బార్ షాపుల యజమానులకు నోటీసులు అందజేశాం. నిర్ణీత సమయం దాటితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. వైన్ షాపుల పరిధి బెల్ట్ షాపుల్లో మద్యం దొరికితే దానికి కూడా షాపు యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మద్యం ఎక్కడ దొరకకుండా, బెల్ట్ షాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నాం.

- సైండ్ల మల్లయ్య, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్

భారీగా పట్టుబడుతున్న మద్యం బాటిళ్లు

- మార్చి 18న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి లేబర్‌కాలనీలో బెల్ట్ షాపుపై దాడిచేసి రూ.10,390 విలువైన మద్యం బాటిళ్లు పట్టుకుని నిర్వాహకుడు పందారి రమేశ్‌పై కేసు నమోదు చేశారు.
- మార్చి 21న గీసుకొండలోని కిరాణం షాపులో రూ.16,210 విలువ గల మద్యం పట్టుకుని, బెల్ట్ షాపు నిర్వాహకుడు బాల సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.
- మార్చి 27వ తేదీన ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో బెల్ట్‌షాపుపై దాడి చేసి ఎలగాటి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.10,820 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చి 28వ తేదీన కేశవపూర్ గ్రామంలోని సయ్యద్ చాంద్ ఇంట్లో రూ.17,160 విలువ గల మద్యం, మోడెం శ్రీనివాస్ ఇంట్లో రూ.8,860 విలువ గల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. దామెరలో చల్లా రాజిరెడ్డి ఇంట్లో రూ.19,300 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెత్రి భాస్కర్, అశోక్ ఇళ్లపై దాడులు చేసి రూ.15,380 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు.
- మార్చి 28న కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి సుబ్బయ్యపల్లిలో ఆడెపు సంపత్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ. 37,100 విలువ కలిగిన మద్యం పట్టుకుని సీజ్ చేశారు.
- మార్చి 29న చిల్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి చిల్పూర్‌లో పిట్టల రాజ్‌కుమార్, శ్రీపతిపల్లిలోని రంగు మాధవ్ ఇంట్లో రూ.13,760 విలువ గల మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు.
- మార్చి 31న నర్సంపేట పోలీస్ స్టేషన్ పరిధి మహేశ్వరంలోని రాజా కిరాణం షాపులో రూ.10,300 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కొత్తపల్లి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇదే రోజు ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఉనికిచర్లలో గడ్డ శ్రీనివాస్ ఇంట్లో రూ.24,400 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 1న ఇదే పోలీస్‌స్టేషన్ పరిధి కాసర్ల సురేష్ ఇంట్లో రూ.17,580 విలువైన మద్యం బాటిళ్లను, కోట కుమారస్వామి ఇంట్లో రూ.11,430 విలువైన బాటిళ్లను పట్టుకున్నారు.
- ఈనెల 4న వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పీచర గ్రామానికి చెందిన రాజు ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.48,290 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 6వ తేదీన రాయపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండూరు గ్రామంలో గిరగోని వేణు ఇంట్లో రూ.23,370 విలువ గల మద్యం, పులి సోమయ్య ఇంట్లో రూ.37,050 విలువ గల మద్యం, ప్రతపాని నాగరాజు ఇంట్లో రూ.18,950 విలువ గల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా..

ఓటును అమ్ముకుంటే భవిష్యత్ అధోగతే



నయీంనగర్: ఓటును అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్ అధోగతే అవుతుందని జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ కమిటీ జాతీయ కార్యదర్శి లోక్ నాథ్ అన్నారు. గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 'ఓటు అమ్ముకోవద్దు.. డబ్బుకు, మద్యానికి ఓటు అమ్ముకుంటే బ్రతికున్నా... శవంతో సమానం' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లోక్‌నాథ్ మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా పోటీ చేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత వంటి అంశాలను పరిశీలించి అభ్యర్థులను ఎన్నుకోవాలని ఓటర్లకు సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గోల మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ధన ప్రలోభాన్ని, ఓట్ల కొనుగోలును ఎండగడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణపై ఓటర్ల బాధ్యతను చాటిచెబుతూ జై భారత్ ఉద్యమం ఆధ్వర్యంలో జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్‌ను తెలంగాణ వ్యాప్తంగా ఉధృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఓటర్లు నాయకుల డబ్బుకు లొంగితే చిల్లర దొంగలకంటే హీనమవుతారని, గెలిచిన నాయకులు గజదొంగలై మన కళ్ల ముందే దేశాన్ని దోచుకుంటారన్నారు. కార్యక్రమంలో వీరయ్య, గగన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వేడి తగ్గాలి.. కోడి పెరగాలి!

వేసవిలో కోళ్ల సంరక్షణ కత్తి మీద సాము!
- అప్రమత్తంగా ఉండకపోతే నష్టం
- పోషకాలున్న దాణా పెడితే మేలు



ఫారంలో ఉన్న కోళ్లు

కరీమాబాద్: ఎండ తీవ్రత అన్ని జీవరాశుల మీద చూపుతోంది. ముఖ్యంగా ఎండాకాలం వచ్చిందంటే చాలు కోళ్ల పరిశ్రమ కుదేలవ్వాల్సిందే.. వేల సంఖ్యలో కోళ్లు చనిపోతాయి. ధరలు కూడా అమాంతం పెరిగిపోతాయి. ఈనేపథ్యంలో కోళ్లకు ఎండ వేడి తగలకుండా.. అవి బాగా పెరిగేలా శాస్త్రవేత్తలు పలు సూచనలిస్తున్నారు. సాధారణంగా కోడి శరీరం చలిని తట్టుకునేలా పూర్తిగా ఈకలతో కప్పబడి ఉంటుంది. ఎండాకాలంలో అవి ఎక్కువ ఉష్ణోగ్రతలు తట్టుకోలేవు. ఉష్ణోగ్రత 107 డిగ్రీల ఫారన్‌హీట్ కంటే బయటి వాతావరణంలో ఉష్ణోగ్రత మించగానే వాటికి చెమట గ్రంథులు లేకపోవడం కారణంగా వేడిని తట్టుకునే పరిస్థితులుండవు. ఈనేపథ్యంలో కోళ్ల ఫారం నిర్వాహకులు, పెంపకందారులు వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, పోషకాలతో కూడిన దాణా పెడితే ఎలాంటి సమస్యలుండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు
వేసవిలో దాణా, నీటి నిష్పత్తి 1:2గా ఉండాలి. ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు 1:4 నిష్పత్తిలో ఉండాలి. వీలైనంత వరకు చల్లని నీరు పెట్టాలి. షెడ్డులో అదనంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నీరు అందుబాటులో ఉంచాలి. నీటిలో ఎలక్ట్రోలైట్లు, విటమిన్ వంటివి కలిపితే అవి ఒత్తిడికి గురి కాకుండా ఉంటాయి. నీళ్ల ట్యాంకులు చల్లగా ఉంచుకోవడం కోసం గోనె సంచులు కప్పి ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలి. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించడానికి పరిశుభ్రమైన నీటినే తాగించాలి. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కోళ్లపైన నేరుగా నీటిని పిచికారీ చేయాలి.

దాణా పెట్టడంలోనూ..
కోళ్లకు పోషకాలున్న దాణాను పెట్టాలి. ఒకేసారి ఎక్కువ దాణా వేయకుండా అవి తింటున్నాకొద్దీ వేయాలి. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ కోళ్లు నీరు ఎక్కువగా తాగుతాయి.. కాబట్టి దాణా తక్కువ తింటాయి. వేసవిలో పగటిపూట సరిగ్గా తినవు. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత దాణా పెట్టాలి. వేడి సమయంలో దాణాను కొద్దిగా తడిపి పెడితే మేలు. అమ్మోనియం క్లోరైడ్, పొటాషియం క్లోరైడ్ ఇవ్వడం వల్ల కోళ్లు నీళ్లు ఎక్కువగా తాగి శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.

షెడ్డు నిర్మాణం..
సూర్య రష్మి తగలకుండా షెడ్డుపైన గడ్డి, స్ప్రింక్లర్లు అమర్చి అరగంటకు ఒకసారి నీళ్లు చల్లాలి. షెడ్డుకు గాలి వచ్చే దిశలో పలుచని గోనె సంచులు, గ్రీన్ నెట్ వంటివి కట్టాలి. రోజుకు 10 నుంచి 15 సార్లు నీళ్లు చల్లడం కారణంగా వడగాల్పులు నేరుగా షెడ్డులోకి రాకుండా చల్లని గాలి వీస్తుంది. షెడ్డులో తేమ లేకుండా పొడిగా, శుభ్రంగా ఉంచుకోవాలి.

వేసవిలో కనిపించే లక్షణాలు.. నివారణ చర్యలు
కోళ్లకు సంబంధించి శరీర ఉష్ణోగ్రతల కన్నా.. వాతావరణ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే.. కోళ్లు ఆయాసపడుతూ తక్కువ మేత తింటూ ఎక్కువ నీళ్లు తాగుతాయి. అలాంటి సందర్భాల్లో వడదెబ్బకు గురై చనిపోయే ప్రమాదముంటుంది. గుడ్ల ఉత్పత్తి బాగా పడిపోతుంది. పౌష్టికాహారం పెట్టినా.. లేయర్ కోళ్లలో గుడ్డు పరిమాణం తక్కువగా ఉంటుంది. బాయిలర్ కోళ్ల ఎదుగుదల ఎక్కువగా ఉండదు. ఎండవేడికి కోళ్లు నీరసంగా కనిపిస్తాయి. నీళ్ల విరేచనాలు అవుతాయి. అయితే అలాంటి లక్షణాలున్న కోళ్లను అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చి చికిత్స చేయించాలి. 8 అడుగుల్లోపు పైకప్పుతో నిర్మించిన షెడ్డులో ఉన్న కోళ్లు ఎక్కువగా చనిపోయే అవకాశాలుంటాయి.

కోళ్లను ఎప్పటికప్పుడు గమనించాలి..



కోళ్లను పెంచుతున్న వారు వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వేసవిలో ఉదయం, సాయంత్రం వేళ వాతావరణం చల్లగా ఉన్నప్పుడే టీకాలు వేయడం, నట్టల నివారణ మందులు ఇవ్వడం వంటివి చేయాలి. వేసవిలో వేడిగాలులు ఎక్కువగా వీస్తుంటాయి కాబట్టి కోళ్లు వ్యాధుల బారిన పడుతుంటాయి. ఏమాత్రం అలసటగా కనిపించినా.. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి.
– డాక్టర్ శశాంక్, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

కడియం కావ్య స్థానికేతరురాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్, చిత్రంలో సీతారాంనాయక్ తదితరులు

- ఆమె గుంటూరు వాస్తవ్యుడిని వివాహమాడింది
- నేను స్థానికుడిని.. ఎవరికి ఓటు వేస్తారో ఆలోచించండి
- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

హన్మకొండ: గుంటూరుకు చెందిన నజీరుద్దీన్‌ను వివాహమాడిన కడియం కావ్య అక్కడి స్థానికురాలని, తాను వరంగల్ బిడ్డనని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. స్థానికేతరురాలైన, ఆంధ్రాకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓటు వేస్తారో, స్థానికుడిని, వరంగల్ బిడ్డనైన తనకు ఓటు వేస్తారో ప్రజలు ఆలోచించాలని కోరారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌తో కలిసి రమేశ్ విలేకరులతో మాట్లాడారు. తాము నరేంద్ర మోదీ టీమ్‌లో పని చేయడానికి వచ్చామని, నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. అజ్మీర సీతారాం నాయక్ మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌లో దళితులను ఎదగనీయకుండా కుట్ర పన్ని అందరినీ బయటకు పంపి తన కూతురుకు టికెట్ ఇప్పించుకున్నాడన్నారు. ఆ తరువాత వెంటనే కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ దళితుల అవకాశాలూ కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. కడియం శ్రీహరికి దళితులంతా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇరువురు బీజేపీ అభ్యర్థుల గెలుపుతో ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ద్రోహులకు టికెట్లు ఇచ్చిందని విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తనను 5 లక్షల మెజారిటీతో గెలిపించాలని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత తెలంగాణ ద్రోహి మాలోతు కవితకు టికెట్ ఇచ్చారన్నారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, చాడ సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూలే దంపతుల పోరాటాలకు తూట్లు

- సామాజికవేత్త ఆచార్య వెంకటనారాయణ



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న వెంకటనారాయణ, పక్కన సంగాని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: స్వాతంత్ర్య భారతదేశంలో మహాత్మాజ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే చేసిన పోరాటాలు ఈనాటికీ పరిష్కారం కాకపోవడం శోచనీయమని సామాజికవేత్త ఆచార్య కూరపాటి వెంకట నారాయణ అన్నారు. పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో.. గురువారం కాకతీయ యూనివర్సిటీలోని దూర విద్యా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ ఇతర బాధ్యులతో కలిసి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారినా దేశంలో బడుగు బలహీనవర్గాల సమస్యలకు పరిష్కారం లభించలేదన్నారు. మద్యం వ్యాపారాన్ని నిషేధించాలని ఆనాడే పూలే దంపతులు చేసిన పోరాటాలు నిర్వీర్యం చేసేలా గల్లీకో బెల్టుషాపులతో పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. పూలే దంపతులు విద్య కోసం పరితపించారని కానీ.. నేటి పాలకులు ప్రభుత్వ విద్యా సంస్థల రూపురేఖలు మార్చలేదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దోచి పెట్టే పనిలో పాలకులున్నారని విమర్శించారు. ఇప్పటికైనా.. పాలకవర్గాలు వాస్తవాలను తెలుసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే పూలే స్ఫూర్తితో బహుజనులు మరో సామాజిక విప్లవం తీసుకొచ్చే అవకాశముందన్నారు. బహుజనులు సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, కుర్తా జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, మాజీ డిప్యూటీ డీఈఓ బూర విద్యాసాగర్, పాస్ బాధ్యులు నల్లాని శ్రీనివాస్, కోల శంకర్, వి.జగన్, శ్రీరాం వీరయ్య, మంద వీరస్వామి, వంగ సుధాకర్, సాయిని నరేందర్, బికేదారి, బొళ్ల వీరప్రతాప్, బాబురావు, నరేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు బీజేపీ ద్రోహం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు
- వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు



అభివాదం తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాకు బీజేపీ ద్రోహం చేసిందని, కేంద్రంలో బీజేపీని సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ నక్కలగుట్టలోనిలోని హరిత కాకతీయ హోటల్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు గత పదేళ్లలో కేంద్రం నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని, విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు నెరవేర్చలేదని, విద్యుత్‌ను ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నం చేసిందని తూర్పారబట్టారు. సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ వంటి బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను కూడగట్టి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం, ఎంసీపీఐ(యూ), ఆర్‌ఎస్పీ, న్యూడెమొక్రసీ నాయకులు ఎం.చుక్కయ్య, కె.శివాజీ, ఆర్.బాలరాజు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా.. వామపక్షాల నాయకులు దొంతి రాజేశ్, గంగుల దయాకర్, రొయ్యల రాజు, రాచర్ల బాలరాజు, కె.శివాజీ, ఎస్.రవీందర్, కుమారస్వామి, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేశ్‌పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మిల్ట్రీ కాలనీకి చెందిన బాపనపల్లి నిర్మల (55) కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నిర్మల, ఆమె భర్త నాగేశ్వర్ రావుకు మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆమె బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుంది. టౌన్ ఎస్సై శివ ఘటనా స్థలికి వెళ్లి నిర్మల మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. నిర్మల పెద్ద కుమార్తె నీలవేణి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య కేసు నమోదు చేసుకున్నారు.

ట్యాక్స్ టెర్రరిజం ప్రకటించిన బీజేపీ

- మంత్రి సీతక్క
- ఎన్నికల సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

కొత్తగూడ: దేశ ప్రజలపై బీజేపీ ప్రభుత్వం ట్యాక్స్ టెర్రరిజాన్ని ప్రకటించిందని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. గురువారం మండలంలోని వేలుబెల్లిలో కొత్తగూడ, గంగారం మండలాల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. కుల, మతాల పేరుతో ప్రజల్లో చిచ్చు పెడుతూ వస్తున్న బీజేపీ పేద, మధ్య తరగతి ప్రజలపై టాక్స్ భారం మోపుతోందన్నారు. ఉపాధి హామీ, అటవీ హక్కు చట్టాలను నిర్వీర్యం చేసి పేదల సొమ్మును అదానీ, అంబానీలకు దోచి పెడుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. రెండు మండలాల అభివృద్ధికి సుమారు వంద కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో పనులు చేయాలంటే కేంద్రం అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, బలరాం నాయక్ గెలిచి కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మరింత సమర్థవంతంగా అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. పైపులైన్ కమీషన్ల కోసమే బీఆర్‌ఎస్ మిషన్ భగీరథ పనులు చేసిందని, పక్కనే పాకాల రిజర్వాయర్ ఉండగా.. పాలేరు నుంచి పైపులైన్ ఎందుకు వేశారని సీతక్క ప్రశ్నించారు.

సమన్వయంగా పని చేస్తా: ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్
కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధి కోసం సీతక్కతో కలసి సమన్వయంగా పని చేస్తానని కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ అన్నారు. రెండు మండలాల్లో తాను మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి తప్ప గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మండలంలోని డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు
మంత్రి సీతక్క ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలు గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఇతర పార్టీల నుంచి చేరికలు జరిగే ముందు అన్ని రకాలుగా ఆలోచించాలని సూచించారు. నమ్మకంగా ఉండేవారినే చేర్పించాలని మోసం చేసేవారిని తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు బానోతు విజయ, సువర్ణపాక సరోజన, జెడ్పీటీసీలు పుష్పలత, ఈసం రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పైడాకుల అశోక్, వజ్జ సారయ్య, జాడి వెంకటేశ్వర్లు, చల్ల నారాయణరెడ్డి, అనిల్, వివిధ గ్రామాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పసికందు మృతి

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
- దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా ఘటన



మృతి చెందిన పసికందు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఆత్మకూరు: దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ పసికందు చనిపోయాడు. ఈ ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన ఎలగందుల శ్రీకాంత్, స్రవంతి దంపతులు తమ ఇద్దరు పిల్లలు మూడేళ్ల కుమార్తె శ్రీనిక, మూడు నెలల పసికందు(బాలుడు) తో కలిసి ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు లక్ష్మీ నృసింహుడి దర్శనానికి కారులో బయల్దేరారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ సమీపంలో గురువారం రాత్రి జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈఘటనలో పసికందు మృతి చెందగా.. శ్రీకాంత్, స్రవంతి, శ్రీనికకు గాయాలయ్యాయి. వీరిని ఎంజీఎంకు చికిత్స నిమిత్తం 108లో తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

రోడ్లపై భారీ వాహనాల పార్కింగ్..
ఆత్మకూరు మండల పరిధి కటాక్షపూర్ నుంచి గుడెప్పాడ్ వరకు దామెర మండల పరిధి నుంచి ఒగ్లాపూర్ వరకు జాతీయ రహదారిపై భారీ వాహనాలు లారీలు, టిప్పర్లు వ్యక్తిగత పనులపై యథేచ్ఛగా నిలుపుతున్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో డ్రైవర్లు టీ, కాఫీలు తాగడానికి, వంటలు చేసుకునేందుకు రోడ్లపై వాహనాల్ని నిలిపేస్తున్నారు. దీంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలని, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి కుంటలో పడి వృద్ధుడు..



రామచంద్రు (ఫైల్)

పెద్దవంగర: నీటి కుంటలో పడి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్న వంగర గ్రామానికి చెందిన పబ్బతి రామచంద్రు (65) గురువారం మృతి చెందాడు. రామచంద్రు మూడు గేదెలను కాసుకుంటూ.. కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈక్రమంలో గేదెలకు పచ్చి గడ్డి కోసుకొస్తానని చెప్పి బుధవారం ఉదయం సుమారు 11 గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. గేదెలకు గడ్డి కోసిన తర్వాత స్నానం చేసేందుకు పక్కనే ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన సైదులు అటుగా వెళ్లాడు. అక్కడ బట్టలు చూసి రామచంద్రు కుమారుడైన సంతోశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేశాడు. అక్కడికి చేరుకున్న గ్రామస్తులు సైదులుతో పాటు కొమ్ము మురళి, రామచంద్రు కుంటలోకి దిగి గాలించి మృతదేహాన్ని గుర్తించారు. కుమారుడు సంతోశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

లింగాలఘణపురం: మండలంలోని సిరిపురంలో వేముల కృష్ణారెడ్డిపై గొడ్డలితో దాడి చేసి గాయపర్చిన ఘటనలో అదే గ్రామానికి చెందిన వేముల నవీన్‌రెడ్డిపై గురువారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారెడ్డి, నవీన్‌రెడ్డి ఇద్దరి భూములు పక్కపక్కనే ఉన్నాయి. నవీన్‌రెడ్డి బుధవారం ఉదయం తన పొలాన్ని చదును చేసి అచ్చు తోలుతున్నాడు. కృష్ణారెడ్డి పొలంలో మట్టి పడగా.. మాటామాటా పెరిగింది. తిరిగి సాయంత్రం కృష్ణారెడ్డి పొలం నుంచి ఇంటికి వస్తుండగా.. నవీన్‌రెడ్డి పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని గొడ్డలితో దాడి చేశాడు. చేతికి బలమైన గాయాలవ్వడంతో.. కృష్ణారెడ్డి తప్పించుకొని చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లాడు. అతడి భార్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీలో 'తూర్పు' మంటలు..!?

బీఆర్‌ఎస్ ముఖ్య నేత చేరిక వద్దంటున్న కమలనాథులు
- ఇప్పటికే కమలం ముఖ్య నేతలతో సదరు నేత మంతనాలు
- పార్లమెంట్ ఎన్నికల వేళ బీసీ నేత వస్తే లాభమని అధిష్టానం లెక్కలు
- ఆయన వద్దంటూ ఘంటాపథంగా వ్యతిరేకిస్తున్న ఇద్దరు ముఖ్యనేతలు



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు బీఆర్‌ఎస్ ముఖ్య నేత బీజేపీలో చేరిక అంశం ఆ పార్టీలో అంతర్గత వివాదానికి ఆజ్యం పోస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీలో వివిధ స్థాయిల్లో పదవులు అనుభవించిన సదరు నేత కమలం గూటికి వచ్చేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నా.. ఈజిల్లాకు చెందిన ఇద్దరు బీజేపీ ముఖ్యులు ఆయన చేరికను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తోంది. అయినా కూడా.. సదరు బీఆర్‌ఎస్ ముఖ్య నేత ఇదే జిల్లాలో గత 15 సంవత్సరాలుగా కమలం పార్టీలో ఉంటూ.. అన్ని స్థాయిల నేతలతో సత్సంబంధాలున్న నాయకుడితో కలిసి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడితోపాటు జాతీయ నాయకులతో మంతనాలు సాగిస్తున్నట్లుగా ఇటు బీఆర్‌ఎస్, అటు బీజేపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల సదరు బీఆర్‌ఎస్ ముఖ్య నేతను కలిసిన ఓ వ్యక్తితో బొట్టు పెట్టుకునే టోళ్లు అందరూ ఆ పార్టీలోకి వెళ్లాలి కదా అంటూ ఆయన సాగించిన సంభాషణ కమలం పార్టీ వైపు చూస్తున్నారని చెప్పకనే చెప్పారని అంటున్నారు. వరంగల్ తూర్పు నుంచి బలమైన నాయకురాలు, మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలో ఉండడంతో వచ్చే ఐదేళ్లు గట్టిగా పోరాడాలంటే బీజేపీనే సరైన వేదికని ఇప్పటికే తన అనుచరుల వద్ద అంతరంగిక సంభాషణల్లోనూ అన్నారనే మాటలు చర్చనీయాంశంగా మారాయి.

భవిష్యత్ ఉంటుందన్న ఆశతో..
ఇటీవల బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ బీజేపీలో చేరడంతోపాటు వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉండడం.. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే బీసీ అయిన తనకు తగిన గుర్తింపు ఉంటుందన్న ఆశతో కమలం దిశగా అడుగులేస్తున్నట్లుగా రాజకీయవర్గాల్లో కోడై కూస్తోంది. దీనిపై సదరు నేత మాత్రం ఎక్కడా బయటకు పొక్కకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ త్వరలోనే బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు వడివడిగా అడుగులేస్తున్నారని టాక్.

బీసీ ఓటర్లపై లెక్కలు..
వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దీంతో సదరు బీఆర్‌ఎస్ ముఖ్య నేతను పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగపడుతుందన్న లెక్కలు బీజేపీ అధిష్టానం కూడా చేసుకుంటుందన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ ఇదే కనుక నిజమైతే ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అరూరి రమేశ్, కడియం శ్రీహరి వంటి కీలక నేతలు బయటకు రావడంతో ఖంగుతిన్న ఆ పార్టీకి మరో షాక్ తప్పదని గులాబీ శ్రేణుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.